ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
కర్ణాటక వార్తలు
శనివారం 6 జనవరి 2024

రేపు బళ్లారిలో ముత్యాల ముగ్గుల పోటీలు

బళ్లారి, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): 'ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ నిర్వహిస్తున్న కెనరా బ్యాంక్ ముత్యాల ముగ్గుల పోటీలు... పవర్డ్ బై ఎయిమ్స్ విద్యాసంస్థలు, బెంగళూరు... రియల్ పార్టనర్ స్వర్గసీమ సుకేతన' సౌజన్యంతో బళ్లారిలో శ్రీచైతన్య సహకారంతో ఆదివారం (రేపు) నగరంలోని హవంబావి వద్ద ఉన్న శ్రీచైతన్య బాలికల పీయు కళాశాల ఆవరణంలో ముత్యాల ముగ్గుల పోటీలు జరగనున్నాయి. ముగ్గులు వేయాలనే ఆసక్తి ఉన్న మహిళలు పాల్గొనాలని నిర్వాహకులు తెలిపారు. ముత్యాల ముగ్గుల పోటీల్లో విజేతలకు మొదటి బహుమతి రూ. 6,000, రెండో బహుమతి రూ.4,000, మూడో బహుమతి విజేతకు రూ. 3,000 నగదు బహుమతిని ఉంటుంది. ఆదివారం ఉదయం 9 గంటలకు ముగ్గుల పోటీలు ప్రారంభం కానున్నాయి. ఆసక్తి ఉన్న మహిళ లు పోటీలో పాల్గొనవచ్చు. ము గ్గుల పోటీల్లో పాల్గొనే మహిళలు 9740581428, 9900167475 గల సెల్ నంబర్లకు కాల్ చేసి పేరు రిజిస్టర్ చేసుకోవాలి.




చిరుధాన్యాలతో అలంకరణ

ఇందిరా క్యాంటీన్లు, మధ్యాహ్న భోజనంలో

చిరు ధాన్యాల ఆహారం


మేళాను ప్రారంభిస్తున్న సీఎం సిద్ధరామయ్య, చిత్రంలో కేంద్రమంత్రి శోభాకరంద్లాజె తదితరులు

బెంగళూరు, జనవరి 5(ఆంధ్రజ్యోతి): రాజధాని బెంగళూరు సహా రాష్ట్రంలో పలు చోట్ల నిర్వహిస్తున్న ఇందిరా క్యాంటీన్లలోనూ, ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ఇస్తున్న మధ్యాహ్న భోజనంలోనూ ఇకపై విరివిగా చిరుధాన్యాలను వినియోగించనున్నామని ముఖ్యమంత్రి సిద్ధరామయ్య ప్రకటించారు. పౌష్టిక అంశాలు అధికంగా చిరుధాన్యాలను నిత్యం ఆహారంగా తీసుకోవడం వల్ల రోగనిరోధశక్తిని పెంచుకోవచ్చని పేర్కొన్నారు. వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో బెంగళూరు ప్యాలెస్ మైదానంలో శుక్రవారం ఏర్పాటు చేసిన చిరు ధాన్యాలు సేంద్రియ ఉత్పత్తుల అంతర్జాతీయ వాణిజ్యమేళాను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమశాఖ మంత్రి శోభాకరంద్లాజె ప్రత్యేక ప్రదర్శనను ప్రారంభించారు. పూర్వీకులు సేంద్రీయ ఎరువులతో అత్యంత సహజంగా పండించిన ఆహార పదార్థాలను తినేవారని, ఫలితంగా చక్కటి రోగ నిరోధకశక్తితో ఆహార పుష్టితో ఉండేవారని, అనారోగ్య సమస్యలు అసలు ఎరుగరని తెలిపారు. పాతతరం ఆహార పద్ధతులు, అలవాట్లు మళ్లీ ప్రాచుర్యం పొందుతుండడం సంతోషంగా ఉందన్నారు. కేవలం ఇందిరా క్యాంటీన్లలోనే కాకుండా విద్యార్థుల మధ్యాహ్న భోజన పథకంలోనూ చిరుధాన్యాలను విరివిగా వినియోగించేలా త్వరలోనే ఉన్నతాధికారుల సమావేశాన్ని నిర్వహిస్తామని సీఎం ప్రకటించారు. రాష్ట్రంలో అత్యున్నత నాణ్యతా ప్రమాణాల చిరుధాన్యాల ఉత్పాదనకు ప్రాధాన్యత ఇస్తున్నామని, తద్వారా దేశ విదేశాలకు ఎగుమతి చేయాలన్నది ప్రభుత్వ ఉద్దేశ్యమన్నారు. చిరు ధాన్యాలను పండించే రైతులు ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు ప్రభుత్వం అన్ని విధాలా అండదండలు అందిస్తుందని హామీ ఇచ్చారు. 2004లో సేంద్రీయ వ్యవసాయ విధానం, 2014లో దీనికి మరిన్ని సవరణలు తెచ్చిన ఘనత తమదేనని గుర్తు చేశారు. కేంద్రమంత్రి శోభాకరంద్లాజె మాట్లాడుతూ నేడు ఆరోగ్య సంరక్షణ విషయంలోనూ, ఆహార అలవాట్లలోనూ ప్రజల్లో బాగా అవగాహన ఏర్పడిందన్నారు. చిరుధాన్యాల ప్రాధాన్యతను అంతర్జాతీయ సమాజానికి చాటిచెప్పిన ఘనత కేంద్ర ప్రభుత్వానికి దక్కుతుందని తెలిపారు. రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి చెలువరాయస్వామి మాట్లాడుతూ ఈ మేళా ద్వారా రైతులు గరిష్ఠంగా ప్రయోజనం పొందాలని ఆకాంక్షించారు. బెంగళూరు ప్యాలెస్ మైదానం త్రిపురవాసినిలో జరుగుతున్న ప్రదర్శనను వీక్షించేందుకు తొలిరోజే సందర్శకులు పోటెత్తారు. చిరుధాన్యాలను వీటితో తయారు చేసిన రకరకాల ఆహార పదార్థాలను మేళాలో ప్రదర్శిస్తున్నారు. ఈనెల 7వరకు మేళా కొనసాగనుంది.

ముగ్గురు మంత్రులు

మంతనాల మర్మమేమిటో..?

- సతీష్ జార్కిహోళి నివాసంలో పరమేశ్వర్, మహదేవప్ప భేటీ



బెంగళూరు, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో సిద్దరామయ్య ప్రభుత్వానికి ఎటువంటి ముప్పులేదని చెప్పలేని పరిస్థితులు వెంటాడుతున్నాయి. రాష్ట్ర కేబినెట్‌లో సీనియర్లుగా ఉన్న ఎస్సీ, ఎస్టీ సామాజిక వర్గానికి చెందిన ముగ్గురు ముంత్రులు రహస్య భేటీ సర్వత్రా చర్చకు దారితీస్తోంది. సదాశివనగర్‌లోని ప్రజాపనుల శాఖ మంత్రి సతీష్‌జార్కిహోళి నివాసంలో గురువారం హోంశాఖ మంత్రి పరమేశ్వర్, సాంఘిక సంక్షేమశాఖ మంత్రి మహదేవప్ప కలిశారు. ముగ్గురు మంత్రులు మినహా ఎవరూ లేరని సమాచారం. లోక్‌సభ ఎన్నికలకు సంబంధించి ఢిల్లీలో కాంగ్రెస్ అధిష్ఠానం నిర్వహించిన కీలక సమావేశంలో పాల్గొనేందుకు సీఎం సిద్దరామయ్య, డీసీఎం పరమేశ్వర్ వెళ్ళిన సందర్భంలోనే వీరి కలయిక ప్రాధాన్యతను సంతరించుకుంది. ప్రస్తుతానికి కేబినెట్‌లో డీకే శివకుమార్ ఒక్కరు మాత్రమే డీసీఎంగా ఉన్నారు. తమకు డీసీఎం హోదా కావాలని ఎన్నికల ఫలితాలు వెలువడినప్పటి నుంచి పరమేశ్వర్, సతీష్‌జార్కిహోళి డిమాండ్ చేస్తున్నారు. సతీష్‌జార్కిహోళి ఏకంగా శివకుమార్‌కు వ్యతిరేకంగా బహిరంగంగానే విమర్శలు చేశారు. ఇలా సాగుతుండగానే ముగ్గురు సీనియర్ మంత్రుల కలయిక సర్వత్రా చర్చనీయాంశమయింది. కొన్నిరోజుల కిందట మంత్రి పరమేశ్వర్ ఇంట్లో ముగ్గురు మంత్రుల సమావేశం జరిగింది. తాజాగా మరోసారి కలవడం వెనుక భారీగానే వ్యూహం ఉన్నట్లు తెలుస్తోంది. లోక్‌సభ ఎన్నికలలోగానే కనీసం మరో రెండు డీసీఎం పదవులు సాధించే దిశగానే వీరి చర్చలు జరిగినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం డీకే శివకుమార్ ఒక్కరే డీసీఎంగా ఉన్నందున ఆయనకు ఎనలేని ప్రాధాన్యత ఉందని, అదే మరో ఇద్దరు ఉంటే సరిపోతుందనే వ్యూహం కూడా ఉన్నట్లు సమాచారం. మహదేవప్ప సుదీర్ఘకాలంగా సీఎం సిద్దరామయ్యకు ఆప్తుడనేది తెలిసిందే. సతీష్‌జార్కిహోళి ఇప్పటికే డీకే శివకుమార్ తీరుపట్ల వ్యతిరేకంగా ఉన్నారు. ఇక పరమేశ్వర్ తటస్థంగానే ఉన్నా ప్రస్తుతం సిద్దరామయ్య వైపు వెళితేనే డీసీఎం పదవి దక్కుతుందనే ఆలోచనలో ఉన్నట్లు తెలుస్తోంది. ఓ వైపు లోక్‌సభ ఎన్నికల కోసం కీలక నేతలు తీవ్రమైన ప్రయత్నాలు సాగిస్తుండగా ముగ్గురు మంత్రుల రహస్య సమావేశాలు సంచలనం కలిగిస్తున్నాయి.


ప్లకార్డుతో ఓ కాఫీ రైతు

కాఫీ తోటలకు కూలీలు కావాలి


- బోర్డుతో రైతు వినూత్న ప్రదర్శన

బెంగళూరు, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): కాఫీ తోటల్లో పనిచేసేందుకు కూలీలు అవసరమని ఓ రైతు వినూత్నంగా బోర్డుతో శుక్రవారం వినూత్న ప్రదర్శన చేశారు. ఈ ఏడాది సకాలంలో వర్షాలు కురవనందున వ్యవసాయ కూలీలు పట్టణ ప్రాంతాల్లో ఉపాధి కోసం వెళ్తున్నారని తద్వారా పల్లెల్లో పనులు చేసేవారు దొరకడం లేదని ఓ రైతు వినూత్నంగా ప్లకార్డు ప్రదర్శించారు. ప్రముఖ పర్యాటక కేంద్రం కొడగు జిల్లా మడికేరి సమీపంలో కాఫీ రైతు బోర్డుతో ఆకట్టుకున్నారు. ప్రస్తుత శీతాకాలం నుంచి వేసవి సమీపిస్తోందన్నారు. కాఫీ కాయలు కోసే సమయం వచ్చిందని తెలిపారు. కూలీలు దొరక్క పనులు సాగడం లేదని వాపోయారు. రోజువారి మహిళలకు రూ.415, పురుషులకు రూ.615 చెల్లిస్తామని, ఎక్కువ సమయం పనిచేస్తే అదనంగా సొమ్ము ఇస్తామని బోర్డులో రాసుకున్నారు. సదరు ఫొటో, వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి.

సంక్రాంతికి ఏపీఎస్ ఆర్టీసీ

ప్రత్యేక బస్సులు

బెంగళూరు, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండుగను పురస్కరించుకుని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ బెంగళూరు నుంచి ప్రత్యేక బస్సులను నడపనుంది. ఈ ప్రత్యేక బస్సులు జనవరి 11 నుంచి 13 వరకు ఉంటాయని ఏపీఎస్ఆర్టీసీ నగరంలో శుక్రవారం విడుదల చేసిన ప్రకటనలో తెలిపింది. ఆంధ్రప్రదేశ్‌లోని విజయవాడ, నెల్లూరు, కర్నూలు, కడప, ప్రొద్దుటూరు, అనంతపురం, చిత్తూరు, తిరుపతితో పాటు అన్ని ముఖ్యమైన పట్టణాలకు ఈ ప్రత్యేక బస్సు సేవలు ఉంటాయని, వీటికి రిజర్వేషన్ల బుకింగ్ కూడా ప్రారంభమైందని పేర్కొంది. అలాగే బెంగళూరు నుంచి తమ బంధువులు స్నేహితులకు ఏవైనా వస్తువులు పంపుకునేందుకు ప్రత్యేక కార్గో లాజిస్టిక్ సదుపాయం కూడా ఉందని, వీటిని వినియోగించుకోవాలని కోరారు. సంక్రాంతి ప్రత్యేక బస్సుల వివరాల కోసం 9880 540140కు ఫోన్ చేయాల్సి ఉంటుంది.



తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1589.04	1,623.66
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	000	00
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	000	8,749
సామర్థ్యం (టీఎంసీలు)	10.25	72.20

జనస్పందనకు ప్రజలు కరువు

● పింఛన్ అందడంలేదని వృద్ధుల మొర

బళ్లారి గాంధీనగర్, జనవరి 6: ప్రజాసమస్యల పరిష్కారం కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన జనస్పందనకు ప్రజల నుంచి పెద్దగా స్పందన రాలేదు. నూతన జిల్లాపాలనా కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటుచేసిన జన స్పందనలో ప్రజల కంటే అధికారులే అధికంగా హాజరైన దృశ్యాలు కనిపించాయి. కార్యక్రమాన్ని ప్రారంభించిన జిల్లాధికారి మాట్లాడుతూ ప్రభుత్వ శాఖల్లో పనులు ఏవైనా పెండింగ్‌లో ఉంటే జనస్పందన కార్యక్రమంలో వాటిని పరిష్కరించు కోవచ్చునన్నారు. ఇలాంటి కార్యక్రమాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. నగరంలో రాష్ట్ర ప్రభుత్వం సూచనలతో నెలలో రెండు సార్లు జన స్పందన కార్యక్రమాన్ని జిల్లాపాలనా మండలి ఏర్పాటు చేస్తుందన్నారు. తాలూకా స్థాయిలో జరిగే జనస్పందన కార్యక్రమంలో ప్రధానంగా గ్రామీణ ప్రజల సమస్యలకు ప్రాధాన్యమిస్తున్నట్లు తెలిపారు. జనస్పందన కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు గ్రామీణ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజల నుంచి అర్జీలు స్వీకరించి పరిష్కరించాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో గ్రామీణ ప్రాంతాలకు చెందిన పలువురు వృద్ధులు పింఛన్ సరిగా అందడం లేదనే విషయం జిల్లాధికారి దృష్టికి తీసుకొచ్చారు. బిసలహళ్ళి గ్రామానికి చెందిన హులిగమ్మ అనే వృద్ధమహిళ మాట్లాడుతూ, గతంలో నెలకు రూ.1200 పింఛన్ వచ్చేదని, అనంతరం అది కాస్తా రూ.600లకు తగ్గిందని, ఆరునెలల నుంచి ఎలాంటి పింఛన్ అందడం లేదని జిల్లాధికారితో మొరపెట్టుకుంది. పింఛన్ల పంపిణీపై పలువురు తమ సమస్యలను అధికారులకు తెలిపారు. శుక్రవారం జరిగిన జనస్పందన కార్యక్రమంలో రెవెన్యూ శాఖకు సంబంధించి 54, సర్వే శాఖకు చెందిన 21, గ్రామీణ పంచాయతీ రాజ్‌కు సంబంధించి 14 అర్జీలతోపాటు వివిధ శాఖలకు చెందిన మొత్తం 130 అర్జీలను అధికారులు ప్రజల నుండి స్వీకరించారు. ప్రస్తుతం కోవిడ్ వ్యాప్తి నేపథ్యంలో అరవై సంవత్సరాలు నిండిన వయోవృద్ధులకు ముందు జాగ్రత్త చర్యగా మాస్కులు పంపిణీ చేశారు.


వేళ్లపై లెక్కపెట్టే సంఖ్యలో కార్యక్రమానికి హాజరైన ప్రజలు

హులిగి హుండీ ఆదాయం 54 రోజుల్లో రూ.1.11 కోట్లు


ఆలయంలో కొలువుదీరిన హులిగమ్మ తల్లి

బళ్లారి గాంధీనగర్, జనవరి 5: కొప్పళ జిల్లా పరిధిలోని హులిగమ్మ ఆలయానికి 54 రోజుల్లో రూ.1.11 కోట్ల ఆదాయం వచ్చిందని దేవాలయ కార్యనిర్వహణ అధికారి అరవింద అయ్యప్ప సుతుగుండి తెలిపారు. ప్రముఖమైన యాత్రాస్థలంగా పేరొందిన హులిగమ్మ దేవస్థానానికి రాష్ట్రంలోని నలుమూలల నుంచి భక్తులు విచ్చేసి అమ్మవారి ఆశీర్వాదం పొందుతుంటారన్నారు. ప్రతి పౌర్ణమి రోజున శక్తిదేవత ఆరాధన ముఖ్యమని, దీంతో గౌరి పౌర్ణమి సందర్భంగా మూడు లక్షల మంది భక్తులు దేవి దర్శనానికి వచ్చినట్లు ఈఓ తెలిపారు. కార్తీకదీపోత్సవం సందర్భంగా కూడా అశేష భక్తజనం అమ్మవారిని దర్శించుకున్నారని, కర్ణాటక రాష్ట్రంలో మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం ఉన్నందున దేవాలయానికి భక్తుల తాకిడి పెరిగిందని ఆయన పేర్కొన్నారు.

విమ్స్ ఆసుపత్రి పనుల పరిశీలన


విమ్స్ ఆసుపత్రిలో పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్సీ సతీశ్ తదితరులు

బళ్లారి సిటీ, జనవరి 5: శాసనమండలి సభ్యుడు వైఎం సతీశ్ నగరంలోని విమ్స్ ఆసుత్రిని సందర్శించి కేంద్ర ప్రభుత్వ సహకారంతో నిర్మిస్తున్న లైబ్రరీ, టీచింగ్ స్టాఫ్ బిల్డింగ్ పనులను పరిశీలించారు. కిద్వానీ ఇన్‌స్టిట్యూట్ సహకారంతో నిర్మిస్తున్న 200పడకల ప్రత్యేక క్యాన్సర్ వార్డును, జిందాల్ కంపెనీ ఆర్థిక సహాయంతో నిర్మిస్తున్న 500పడకల తల్లీబిడ్డల ఆసుపత్రి పనులను పరిశీలించారు. సతీశ్‌బాబు మాట్లాడుతూ పనులు నాణ్యతతో జరిగేవిధంగా చూడాలని ఆసుపత్రి సూపరింటెండ్ సోమశేఖర్‌కు సూచించారు. ఈసందర్భంగా డాక్టర్ దివాకర్ గడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యతోనే దేశ ప్రగతి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే బీఎం నాగరాజు

సిరుగుప్ప, జనవరి 5: విద్యతోనే దేశ ప్రగతి సాధ్యమని ఎమ్మెల్యే బీఎం నాగరాజు అభిప్రాయ పడ్డారు. పట్టణంలోని గురుభవన్‌లో ప్రభుత్వ ఉద్యోగుల ఫెడరేషన్ ఆధ్వర్యంలో విద్యాప్రగతి, సావిత్రీబాయి పూలే జయంతి వేడుకలను శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే బీఎం నాగరాజ మాట్లాడుతూ దేశం అన్ని రంగాలలో వృద్ధిలోకి రావాలంటే విద్య అత్యవసరమని ఆయన తెలిపారు. సావిత్రీబాయి పూలే అక్షరజ్ఞానంతోనే ఎంతో చరిత్ర సాధించిందని ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయుల సంఘం అధ్యక్షులు శ్రీధర్, ప్రభుత్వ ఉద్యోగుల సంఘం అధ్యక్షులు శ్రీధర్‌రెడ్డి, ఉపాధ్యాయులు, ప్రజలు పాల్గొన్నారు.

రేపు సత్యం పీయూ కళాశాలలో సెల్ఫ్ ఎవాల్యుయేషన్ టెస్ట్

బళ్లారి గాంధీనగర్, జనవరి 5: బళ్లారి నగరంలోని కప్పగల్లు రోడ్డులోని సత్యం పీయూ కళాశాలలో సర్‌ఎంవీ దావణగెర ఆధ్వర్యంలో మొదటి సంవత్సరం పీయూసీ-2024 ప్రవేశానికి అడ్మిషన్ కమ్ స్కాలర్‌షిప్ టెస్ట్ (సెల్ఫ్ ఎవాల్యుయేషన్ టెస్ట్)ను ఈనెల 7వ తేదీ, 21వ తేదీ రెండు రోజులలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి 12గంటల వరకు నిర్వహించే ఈ పరీక్షల్లో సీబీఎస్ఇ, ఏసీఎస్ఈ, స్టేట్ సిలబస్‌కు సంబంధించి అంశాలపై పరీక్ష నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ విద్యాసాగర్ వివరించారు. పీయుసిలో చేరాలనుకునే విద్యార్థులకు ఇదొక మంచి అవకాశంగా భావించాలన్నారు. ఇందులో అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు ఫీజులో రాయితీ ఉంటుందని, ఈ సదావకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని విద్యాసాగర్ తెలిపారు. విద్యారంగంలో అగ్రగామిగా ఉన్న సర్ ఎంవి దావణెగెర సంస్థ ద్వితీయ పియుసి బోర్డు పరీక్షల్లో అత్యుత్తమ మార్కులతో ఉత్తమ ఫలితాలు సాధించిందన్నారు. మరిన్ని వివరాల కోసం 817764018 నెంబరుకు ఫోన్ చేసి వివరాలు పొందవచ్చునన్నారు.



సత్యం కళాశాల

కుడితినిలో కుంటుపడుతున్న అభివృద్ధి


సమావేశంలో మాట్లాడుతున్న కౌన్సిలర్ కనికేరి పంపాపతి

కంప్లి, జనవరి 5 : జిల్లా పరిధిలోని కుడితిని పట్టణంలో పట్టణ పంచాయతీ అధికారుల నిర్లక్ష్యం వల్ల అభివృద్ధి పనులు కుంటుపడుతున్నాయని కుడితిని పట్టణ పంచాయతీ 3వ వార్డు కౌన్సిలర్ కనికేరి పంపాపతి తెలిపారు. కుడితినిలో ఆయన విలేఖరులతో మాట్లాడారు. పట్టణంలో తాగునీరు, విద్యుత్ దీపాల కోసం ఎన్నోసార్లు పట్టణ అధికారుల చుట్టూ తిరిగినా ప్రయోజనం లేకుండా పోయిందన్నారు. దీనికి తోడు 15 మంది వుండాల్సిన సిబ్బంది కేవలం ఇద్దరు ముగ్గురు మాత్రమే వున్నారన్నారు. అధికారులు అభివృద్ధి పనులు జరుగకపోయినా అభివృద్ధి చేశామని బిల్లులు చేసుకుంటున్నారన్నారు. పట్టణంలో 45 బోర్లు వున్నా ఇంతవరకు సరిగా రిపేర్లు లేక నీటి సమస్య వార్డుల్లో తాండవ మాడుతోందన్నారు. బోర్లు రిపేరీ చేశామని కూడా బిల్లులుపెట్టారన్నారు. మొత్తానికి ముఖ్య అధికారి నిర్లక్ష్యంతో పట్టణంలో రోజురోజుకు సమస్య తలెత్తుతోందన్నారు. జిల్లా శాఖాధికారులు, కుడితిని పట్టణ పంచాయతీపై దృష్టి సారించి సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఆయనతో పాటు గ్రామ ప్రముఖులు మోకా తిమ్మప్ప, మాంతేష్, భీమేష్, లోకేష్, తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌ఎస్ స్థలాల రిజిస్ట్రేషన్ దందాను అరికట్టాలి

బళ్లారి గాంధీనగర్, జనవరి 5: నగరంలో రిజిస్ట్రేషన్ కార్యాలయంలో ఆర్‌ఎస్ (రూరల్ సర్వే) స్థలాల రిజిస్ట్రేషన్ పేరుతో జరుగుతున్న దందాను అరికట్టాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం సువర్ణ కర్ణాటక వేదిక పదాధికారులు రిజిస్ట్రేషన్ అధికారికి మనవి పత్రం అందజేశారు. ఆర్‌ఎస్ రిజిస్ట్రేషన్‌లను ఒక వ్యాపారంగా మార్చుకుంటూ రిజిస్ట్రేషన్ అధికారులతో లోపాయకారీ ఒప్పందం కుదుర్చుకుని అమాయక ప్రజల నుండి వేలాది రూపాయలు దండుకుంటున్నారని వారు ఆరోపించారు. ప్రస్తుతం నగరంలో 600 చదరపు అడుగుల ఆర్‌ఎస్ స్థలం రిజిస్ట్రేషన్ జరగాలంటే ప్రభుత్వానికి స్టాంప్ డ్యూటీ కన్నా మధ్యవర్తులకు మామూళ్ళే ఎక్కువగా చెల్లించాల్సి వస్తోందని బహిరంగంగా ఆరోపణలు వినిపిస్తున్నాయన్నారు, రిజిస్ట్రేషన్లలో అవినీతిని అరికట్టకపోతే పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని సువర్ణ కర్ణాటక వేదిక రాజ్యాధ్యక్షులు నారాయణస్వామి అధికారులను హెచ్చరించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన కార్యదర్శి నాగిరెడ్డితోపాటు ఉమేష్, ప్రశాంత్, అరుణ్, గోవిందు, గోపాల్, నాగరాజు, రాకేష్, గంగాధరలు పాల్గొన్నారు.


అధికారికి వినతి పత్రం అందజేస్తున్న సువర్ణ కర్ణాటక వేదిక పదాధికారులు

బసవేశ్వర్ నగర్‌లో కూరగాయల మార్కెట్ ఏర్పాటు

బళ్లారిరూరల్, జనవరి 5 : బళ్లారి నగరం మోకారోడ్డు బసవేశ్వర నగర్ సమీపంలో నూతన కాయగూరల మార్కెట్‌ను శుక్రవారం సిటీ ఎమ్మెల్యే నారా భరత్ రెడ్డి, కార్పొరేటర్ సురేఖ, మల్లన్నగౌడ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ఈ కాలనీ సమీపంలో కూరగాయల మార్కెట్ అందుబాటులోకి రావడంతో ప్రజలకు, చిరు వ్యాపారులకు, అనుకూలంగా ఉంటుందన్నారు. ఇలాంటి మార్కెట్‌లను పలు ప్రాంతాల్లో ఏర్పాటు చేస్తామన్నారు.

శిథిల భవనాన్ని తొలగించాలి

సిరుగుప్ప, జనవరి 5: పట్టణంలో శిథిలావస్థకు చేరుకున్న పాత శిశు అభివృద్ధి కార్యాలయాన్ని తొలగించాలని స్థానికులు కోరుతున్నారు. ఈ భవనం పైకప్పు ఎగిరిపోయింది. గోడలు బీటలు వారాయి. చాలా సార్లు స్థానికులు ఈ విషయంపై సంబంధిత అధికారులకు తెలిపినా పట్టించుకోకపోవడం గమనార్హం. ఇకనైనా ఈ విషయంపై దృష్టిసారించి శిథిలావస్థకు చేరుకున్న ఈ భవనాన్ని తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.

హత్యకేసు నిందితులను అరెస్టు చేయాలి



ఆందోళన చేస్తున్న పింజార సమాజ ప్రజలు

బళ్లారి గాంధీనగర్, జనవరి 5: డిసెంబరు 31వ తేదీన బళ్ళారి వడ్డరబండ ప్రాంతంలో సయిదుల్లా హత్యకు కారకులైన వారిని వెంటనే అరెస్టు చేయాలంటూ కర్ణాటక రాష్ట్ర నదాఫ్/పింజార్ సంఘం జిల్లా విభాగం ఆధ్వర్యంలో వందలాది మంది ప్రజలు జిల్లాధికారి కార్యాలయం ఆందోళన చేపట్టారు. ఈ ఘటనకు సంబంధించి జిల్లా పోలీసులు ఇప్పటికే ముగ్గురిని అరెస్టు చేయగా, మరి కొంత మందిని అరెస్టు చేయాల్సి ఉందని పింజార్ సమాజం ప్రముఖులు డిమాండ్ చేశారు. నగరంలో ప్రొఫెషనల్ కిల్లర్స్ సంఖ్య పెరుగుతోందని ఇలాంటి వారిద్వారా సమాజంలో శాంతిభద్రతలకు భంగం వాటిల్లే పరిస్థితి నెలకొందని అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. హత్యకు గురైన సైదుల్లా కూలి పనిచేస్తూ ఇంటికి చేదోడు వాదోడుగా ఉండేవాడని, కన్న కొడుకుని కోల్పోవడంతో ఆ కుటుంబానికి తీరని కష్టం వచ్చిందన్నారు. ఇదే ఘటనలో తీవ్రంగా గాయపడిన వ్యక్తి చావు బతుకుల మధ్య పోరాడుతున్నాడని, ఆ యువకుడు కూడా పేద కుటుంబానికి చెందిన వాడన్నారు. ఇలాంటి ఘటనలు నగరంలో పునరావృత్తం కాకుండా చూడాల్సిన బాధ్యత పోలీసు అధికారులపై ఉందన్నారు. తమ సమాజానికి భద్రత కల్పించాలని ఈ సందర్భంగా కోరారు. ఈ హత్యకు గురైన కుటుంబాలని ఆదుకోవాలని డిమాండ్ చేస్తూ జిల్లాధికారి కార్యాలయం అధికారికి మనవి పత్రం అందజేశారు.

యువనిధి పథకంలో పేర్లు నమోదు చేసుకోవాలి

బళ్లారి గాంధీనగర్, జనవరి 5: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన యువనిధి పథకంలో నిరుద్యోగ యువకులు పేర్లు నమోదు చేసుకోవాలని జిల్లాధికారి ప్రశాంత్ కుమార్ మిశ్రా పేర్కొన్నారు. 'యువనిధి' పథకం నమోదులో భాగంగా జిల్లా స్థాయి అధికారుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన ఐదు గ్యారెంటీ పథకాల్లో యువనిధి పథకం ఒకటని, డిగ్రీ పాసైన వారికి ప్రతి నెలా రూ 3వేలు, డిప్లొమా పూర్తి చేసిన వారికి రూ.1500లు ఇచ్చేలా, ఈ పథకాన్ని ఈనెల 12న రాష్ట్ర ముఖ్యమంత్రి శివమొగ్గలో ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. డిగ్రీ, డిప్లొమా పూర్తిచేసిన వారు ఎక్కువ సంఖ్యలో పేర్లు నమోదు చేసుకుని పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ పథకానికి సంబంధించి ఆసక్తిగలవారు సేవా సింధు పోర్టల్ లేదా కర్ణాటక-1, బళ్ళారి-1 లేదా ఇతర సేవా కేంద్రాల్లో నమోదు చేసుకోవాల్సి ఉంటుందని వివరించారు. ఈ సందర్భంగా జిల్లా పంచాయతీ ముఖ్య కార్యనిర్వహణ అధికారి రాహుల్ శరణప్ప సంకనూరులతో పాటు వివిధ జిల్లాస్థాయి ప్రభుత్వ అధికారులు పాల్గొన్నారు.

పీఎంజే జువెలరీ స్టోర్ ప్రారంభం


పీఎంజే నూతన జువెలరీ స్టోర్‌ను ప్రారంభిస్తున్న సిటీ ఎమ్మెల్యే భరత్ రెడ్డి

బళ్లారిరూరల్, జనవరి 5: నగరంలోని ఇన్‌ఫ్రాంట్ రోడ్డు రిలయన్స్ మార్ట్ ఎదురుగా శుక్రవారం ఉదయం పీఎంజే నూతన జువెలరీ షాపును సిటీ ఎమ్మెల్యే నారా భరత్ రెడ్డి, పీఎంజే జువెలర్ అధినేత రామిరెడ్డి, జువెలర్ స్టోర్ మేనేజర్ ఖాజాబాబు ప్రారంభించారు. అనంతరం నారా భరత్ రెడ్డి మాట్లాడుతూ, దక్షిణ భారతదేశంలో పీఎంజే జువెలర్స్ బళ్లారిలో ప్రారంభించడం సంతోషంగా వుందన్నారు. 5వ తేదీ నుంచి 9వ తేదీ వరకు ఇక్కడ ప్రత్యేక ప్రదర్శనలు నిర్వహిస్తారు. మొదటి ఆరురోజులు అందరికీ ఆకర్షణీయమైన బంగారు నాణేలను బహుమతులుగా ఇస్తారని వారు తెలిపారు. అదేవిధంగా స్టోర్ యజమాని రామిరెడ్డి మాట్లాడుతూ వివాహ శుభ కార్యాలకు వివిధ రకాల ఆభరణాలను కస్టమర్లకు అందిస్తున్నట్లు తెలిపారు. ఈ స్టోర్‌ను నగర ప్రజలతో పాటు గ్రామీణ ప్రజలు కూడా సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈకార్యక్రమంలో శ్రీనివాసరెడ్డి, వార్డు కార్పొరేటర్ రాజేశ్వరి, తదితర నగర ప్రముఖులు పాల్గొన్నారు.

ఘనంగా పరమహంస యోగానంద జయంతి


యోగానందకు పూజలు నిర్వహించిన డ్రీమ్ పాఠశాల యాజమాన్యం

బళ్లారి గాంధీనగర్, జనవరి 5: పరమహంస యోగానంద 130వ జయంతిని నగరంలోని డ్రీమ్ వరల్డ్ పాఠశాలలో ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో డ్రీమ్ వరల్డ్ పాఠశాల విద్యార్థినీ విద్యార్థులు భగవద్గీత, వేంకటేశ్వర సుప్రభాతం, హనుమాన్ చాలీసా, విష్ణు సహస్ర నా మం, భజన పాటలు పాడి కార్యక్రమానికి హాజరైన అతిథులను, విద్యార్థుల తల్లితండ్రులను ఆకట్టుకున్నారు. ఈ సందర్భంగా డ్రీమ్ వరల్డ్ చీఫ్ అనిల్ కుమార్ మాట్లాడుతూ, విద్యార్థులు చదువుతో పాటు మన సంస్కృతి, సాంప్రదాయాల పట్ల అవగాహన కలిగి ఉండాలన్నారు. ఈ సందర్భంగా తల్లితండ్రులు, విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు. అనంతరం విద్యార్థులకు, వారి తల్లితండ్రులకు తీర్థప్రసాదాలు పంచిపెట్టారు.

హోసూరు జోన్

గ్రంథాలయం ప్రారంభం


జ్యోతి ప్రజ్వలనలో ప్రముఖులు

హోసూరు, జనవరి 5: హోసూరు కామరాజ్ కాలనీలో నూతనంగా నిర్మించిన గ్రంథాలయాన్ని ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ వర్చువల్ రూపంలో శుక్రవారం ప్రారంభించారు. మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, త్రాగునీటి సరఫరాలశాఖ తరపున రూ.1933.7 కోట్ల విలువైన 200 ప్రాజెక్టులను చెన్నై సెక్రటేరియట్ నుంచి సీఎం వర్చువల్‌గా ప్రారంభించారు. ఇందులో భాగంగా కృష్ణగిరి జిల్లా హోసూరు మున్సిపల్ కార్పొరేషన్ వార్డు నెం.31 కామరాజ్ నగర్ స్పోర్ట్స్ గ్రౌండ్ సమీపాన ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలను, గ్రంథాలయాన్ని, నాలెడ్జ్ సెంటర్‌ను నిర్మించారు. ఈ కేంద్రంలో జనరేటర్ సౌకర్యం, సౌర విద్యుత్, పార్కింగ్, కింది అంతస్థులో విశాలమైన రీడింగ్ రూమ్, మొదటి అంతస్తులో వివిధ సౌకర్యాలు ఉన్నాయి. 4000 చదరపు మీటర్ల విస్తీర్ణంల్లో భవనం ఉంది. జనరల్ స్టడీ రూమ్ 1, 2, యూత్ స్టడీ రూమ్, కంప్యూటర్స్ విద్యా కేంద్రం గది, వెబ్‌సైట్ మార్గాలు, బుక్ షెల్స్ స్టోరేజ్, అన్ని విభాగాలను అన్ని సౌకర్యాలతో అప్‌గ్రేడ్ చేశారు. ఈ కేంద్రం నగరం నడిబొడ్డున ఉన్న కామరాజ్ కాలనీలో ఉంది. అలాగే హోసూరు ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల, ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల హోసూరు మున్సిపల్ కార్పొరేషన్ తమలాం, ఇంగ్లిష్, తెలుగు, ఉర్దూ మీడియం పాఠశాలలు ఈ మేథో కేంద్రం సమీపంలో నడుస్తున్నాయి. పాఠశాలలో 10 వేలమంది ఉన్నారు. ఈ సందర్భంగా హోసూరు కార్పొరేషన్ ఇంజనీర్ రాజారాం, మున్సిపల్ హెల్త్ కమిటీ చైర్మన్ మాదేశ్వరన్, పన్నుల కమిటీ చైర్మన్ చెన్నీరప్ప, కౌన్సిలర్లు, నాగరాజ్, ఇంద్రాణి, కణ్ణన్, పార్వతి నాగరాజ్ డివిజన్ కార్యదర్శి రాము, మత్తిగిరి రవికుమార్‌తో పాటు పలువురు హోసూరు లైబ్రరీ, ఇంటలెక్చువల్ సెంటర్‌ను జ్యోతి వెలిగించి ప్రారంభించారు.

ఫ్లై ఓవర్ నిర్మాణ పనులతో ట్రాఫిక్‌కు అంతరాయం

హోసూరు, జనవరి 5: హోసూరు సమీపంలో బెంగళూరు-చెన్నై జాతీయ రహదారిపై జూజువాడి, సిప్‌కాట్ ప్రాంతంలో భారీగా ట్రాఫిక్ స్తంభించింది. హోసూరు సిప్‌కాట్ ప్రాంతంలో జాతీయ రహదారి 7కు అనుబంధంగా ఫ్లైఓవర్ పనులు చేపట్టారు. ఈ నేపథ్యంలో వాహనాలు సజావుగా వెళ్లలేని పరిస్థితి నెలకొంది. సర్వీస్ రోడ్డు ఉన్నా జాతీయ రహదారి మార్గంలోనే వెళ్లేందుకు ప్రయాణీకులు ఆసక్తి చూపడంతో తరచూ ట్రాఫిక్ స్తంభిస్తోంది.


జాతీయ రహదారిపై బారులుతీరిన వాహనాలు

14 వరకు చేతివృత్తుల మేళా

హోసూరు, జనవరి 5: తమిళనాడు హ్యాండ్‌లూమ్ ఇండస్ట్రీ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో సేలం శాఖ ద్వారా హోసూరులో హ్యాండీక్రాఫ్ట్ మేళాను ఏర్పాటు చేసింది. మీరా మహాల్‌లో మేళాను సబ్ కలెక్టర్ ప్రియాంక శుక్రవారం లాంఛనంగా ప్రారంభించారు. హస్తకళాకారులను ప్రోత్సహించేలా వారి ఉత్పత్తులను మేళాలో విక్రయించేందుకు వీలు కల్పించారు. ఈనెల 14వరకు ప్రదర్శన కొనసాగనుంది. వివిధ రకాల హస్తకళలు, చేనేత వస్త్రాలు, అలంకార ఆభరణాలు, నాచియార్ దీపాలు, తంజావూరు ఆర్ట్ ప్లేట్‌లు, కళాఖండాలు, గంధపు చెక్క శిల్పాలు, బొమ్మలు, రాతి శిల్పాలు, మధురై, కాశ్మీరి, వారణాసీ పట్టు చీరలు, ముత్యాలు, పగడాలు ఇతరత్రా అందుబాటులో ఉంచారు. ఉత్పత్తులను కొనుగోలు చేయడం ద్వారా కళాకారులకు బాసటగా ఉండాలని హ్యాండ్‌లూమ్ ఇండస్ట్రీ మేనేజర్ నరేంద్రబోస్ తెలిపారు.

ఆరోగ్య కార్డులను సద్వినియోగం చేసుకోవాలి



మిట్టిమల్కాపూర్ ఆరోగ్య కేంద్రాన్ని సందర్శిస్తున్న డీహెచ్‌ఓ డాక్టర్ సురేంద్ర బాబు

రాయచూరు జనవరి 5 : ప్రజల ఆరోగ్య పరిరక్షణే లక్ష్యంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందజేసే ఆరోగ్య కార్డులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని డీహెచ్‌ఓ డాక్టర్ సురేంద్రబాబు సూచించారు. శుక్రవారం జిల్లాలోని మిట్టిమల్కాపూర్ గ్రామ పంచాయతీని సందర్శించిన డీహెచ్‌ఓ డాక్టర్ సురేంద్రబాబు, అక్కడ ఏబీపీఎంజేవైసీఎం ఆరోగ్య కర్ణాటక కార్డుల నమోదు, వాటి వివరణకు సంబంధించి పంచాయతీ అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కార్డులను ప్రజలకందించిన డీహెచ్‌ఓ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న ఆరోగ్య పథకాలను ఈ కార్డుల ద్వారా ఎలా పొందవచ్చో గ్రామస్థులకు వివరించారు.

ఉత్సాహంగా తాడు లాగుడు పోటీలు

● విజేతలకు నగదు బహుమతుల అందజేత

రాయచూరు జనవరి 5 : జిల్లాలోని దిన్ని గ్రామ పంచాయతీ పరధిలోగల తాండాలో మారికాంబదేవి జాతరను పురస్కరించుకుని నిర్వహించిన తాడు లాగుడు పోటీలు శుక్రవారం అత్యంత ఉత్సాహంగా సాగాయి. వివిధ గ్రామాల నుంచి వచ్చిన యువకులు జట్లుగా ఏర్పడి తాడు లాగుడు పోటీల్లో పాల్గొన్నారు. హోరాహోరిగాసాగిన ఈ పోటీల్లో వీర మదకరి నాయక తాండాకు చెందిన యువకులు ప్రథమ విజేతలుగా నిలిచి రూ.3వేల నగదు బహుమతిని అందుకున్నారు. పోటీలో పాల్గొన్న కిచ్చబళగ యువకులు ద్వితీయ స్థానంలో రూ.2వేల బహుమతును అందుకున్నారు.


తాడు లాగుతున్న యువకులు

నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శ. శంకరనారాయణ కాంచ్...

బాలసుబ్రమణియమ్ (జయంతి)



జీఎన్‌బీగా చిరపరిచితులైన గుడలూరు నారాయణ స్వామి బాల సుబ్రమణి యమ్ 1910 జనవరి 6న తమిళనాడు రాష్ట్రం థేని జిల్లా గుడలూరు ప్రాంతంలో జన్మించారు. కర్ణాటక సంగీత గాయకులు. సెమ్మంగుడి శ్రీనివాస అయ్యంగార్, మధురై మణి అయ్యర్‌లతో కలసి ప్రదర్శనలు ఇచ్చారు. కర్ణాటక గాయనంలో 'లయ'కు ప్రాధాన్యత ఇస్తూనే 'గమకం'ను నియంత్రించే కొత్తశైలి ప్రవేశపెట్టిన ఘనత ఆయనది. 250కుపైగా కృతులు స్వరకల్పన చేశారు. చెన్నైలోని ఆలిండియా రేడియోలో కర్ణాటక సంగీత కార్య క్రమాలకు ప్రధాన నేతృత్వం వహించారు. 1965 మే 1న కన్నుమూశారు.

సీఎస్ జయరామన్ (జయంతి)



చిదంబరం సుందరం పిళ్లై (సీఎస్) జయరామన్ 1917 జనవరి 6న తమిళనాడు రాష్ట్రం చిదంబరంలో జన్మించారు. 1940 - 70 మధ్య తమిళ సినిమాలలో ప్రముఖ నటుడు, సంగీత దర్శకుడు, నేపథ్య గాయకుడిగా రాణించారు. కన్నడలోనూ కొన్ని పాటలు రచించారు. వాటిలో డాక్టర్ రాజ్‌కుమార్ నటించిన 'బేడర కన్నప్ప'లోని 'శివప్ప కాయో తండే' పాట ఎంతో పేరొందింది. తమిళనాడు మాజీ సీఎం కరుణానిధి ఇతని బావమరిది. ఈ కారణంగా కరుణానిధి సినీరంగంలో స్క్రిప్ట్ రైటర్‌గా అడుగుపెట్టారు. సీఎస్ జయరామన్ 1995 జనవరి 29న కన్నుమూశారు.

ఓం పురి (వర్ధంతి)




'పద్మశ్రీ' గ్రహీత ఓంపురి 1950 అక్టోబరు 18న పంజాబ్ రాష్ట్రం అంబాలాలో జన్మించారు. హిందీ సినిమాలలో ప్రధానపాత్రలో పోషించి గుర్తింపు పొందారు. బుల్లితెరపైనా పలు సీరియల్స్‌లో నటించారు. ఆయన నటించిన సినిమాలు యునైటెడ్ కింగ్‌డమ్‌లోనూ, యునైటెడ్ స్టేట్స్‌లోనూ చిత్రీకరించబడ్డాయి. ఆయన సాధనలకు 'ఆర్డర్ ఆఫ్ ది బ్రిటీష్ ఎంపైర్‌లో గౌరవ ఆఫీసర్‌గాను కొనసాగారు. జీవితసాఫల్య పురస్కారం, ఇతర అవార్డులు పొందారు. 2017 జనవరి 6న కన్నుమూశారు.

కపిల్‌దేవ్ (పుట్టినరోజు)



'పద్మభూషణ్' గ్రహీత కపిల్ దేవ్ రామ్‌లాల్ నిఖంజ్ 1959 జనవరి 6న చండీఘడ్‌లో జన్మించారు. క్రికెట్‌లో ఆల్ రౌండర్‌గా దేశం లోనే కాక ప్రపంచంలోనే గుర్తింపు పొందారు. ఆయన కెప్టెన్సీలో 1983లో భారత జట్టు వరల్డ్ కప్ సాధించింది. వన్డేలలోనూ, టెస్ట్ మ్యాచ్‌లలోనూ రికార్డులు కలిగారు. భారతజట్టు ప్రధాన పేస్ బౌలర్‌గా, బ్యాట్స్‌మెన్‌గా ఎన్నో విజ యాలు అందించారు. 1994లో రిటైరయ్యాక కోచ్‌గా, బౌలింగ్ కన్సల్టెంట్‌గా వ్యవహరించారు. వన్డేలలో 200 వికెట్‌లు తీసిన రికార్డు ఉంది. 2019లో హర్యానాలోని స్పోర్ట్స్ యూనివర్సిటీకి తొలి ఛాన్సెలర్‌గా వ్యవహరిం చారు. 'అర్జున' అవార్డుతో పాటు పలు పురస్కారాలు పొందారు. ఐసీసీ క్రికెట్ హాల్ ఆఫ్ ఫేంలో గుర్తింపు పొందారు.

'వందేమాతరం' శ్రీనివాస్ (పుట్టినరోజు)



'వందేమాతరం' శ్రీనివాస్ 1966 జనవరి 6న ఖమ్మం జిల్లా చింతకాని మండలం రామకృష్ణాపురం గ్రామంలో జన్మించారు. అసలు పేరు కన్నెబోయిన శ్రీనివాస్. 'వందేమాతరం' సినిమాలో నేపథ్యగాయకుడిగా పరిచయమై పేరొందారు. తెలుగు సినీ గాయకుడు, గీత రచయిత, సంగీత దర్శకుడు. తెలుగు, తమిళ, కన్నడ, హిందీ భాషలలో 250కుపైగా సినిమాలకు సంగీత దర్శకత్వం వహించారు. సినిమాలకే కాక టీవీ సీరియల్స్‌కు కూడా నేపథ్య సంగీతం అందించారు. 9 నంది అవార్డులు, 9 భరతముని పురస్కారాలు, 6 మద్రాస్ కళాసాగర్ అవార్డులు, ఇతర పురస్కారాలు అందుకున్నారు.

ఏఆర్ రెహమాన్ (పుట్టినరోజు)



'పద్మభూషణ్' గ్రహీత అల్లా రఖా (ఏఆర్) రెహమాన్ 1967 జనవరి 6న మద్రాస్‌లో జన్మించారు. అసలు పేరు ఏఎస్ దిలీప్ కుమార్. అంతర్జాతీయ స్థాయిలో పేరొందిన సంగీత దర్శకుడు, స్వరకర్త, గాయకుడు, మ్యూజిక్ ప్రొడ్యూసర్. తమిళ, హిందీ సినిమాలలో ఎంతో పేరొందారు. కర్ణాటక శాస్త్రీయ సంగీతం, పాశ్చాత్య, హిందూస్థానీ క్లాజిక్‌లోనూ, ఖవ్వాలీలోనూ రాణించారు. ఛారిటీలకోసం సంగీత కచేరీలు నిర్వహించారు. 6 జాతీయ, 2 ఆస్కార్, 2 గ్రామీ, 15 ఫిల్మ్‌ఫేర్, 17 ఫిల్మ్‌ఫేర్ అవార్డ్స్ సౌత్, రెండు గౌరవ డాక్టరేట్‌లు ఇతర పురస్కారాలు పొందారు.

మెడిసిన్ విద్యార్థి అదృశ్యం



దర్శన్‌కుమార్ (ఫైల్)

పావగడ, జనవరి 5: పట్టణంలోని ధర్మవరం లేఔట్‌లో నివసిస్తున్న శ్రీబాబుప్రసాద్ శ్రీలక్ష్మి దంపతుల కుమారుడు దర్శన్‌కుమార్ వారం రోజుల క్రితం అదృశ్యమైనట్లు పావగడ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు ఎస్‌ఐ గురునాథ్ తెలిపారు. కుందుర్పి మండలం జంబుగుంపుల పాళ్యం గ్రామానికి చెందిన శ్రీబాబుప్రసాద్ పావగడ పట్టణంలోని ధర్మవరం లేఔట్‌లో నివాసం ఉండగా వీరి కుమారుడు దర్శన్‌కుమార్ దావణగెరెలోని ఎస్ఎస్ఐఎంఎస్ మెడికల్ కళాశాలలో మొదటి సంవత్సరం ఎంబీబీఎస్ చేస్తుండేవాడని, చదువుపై ఆసక్తి ఉండి ఏకాగ్రతతో చదవడం వల్ల మతిమరుపు అధికమై మొదటి సంవత్సరంలో మూడుసార్లు ఫెయిల్ అయ్యాడని ఫిర్యాదులో పేర్కొన్నట్లు తెలిపారు. మానసిక వ్యాధికి గురై వారం రోజుల నుంచి కనిపించకపోయాడని, ఇతని ఆచూకీ తెలిస్తే 798902 2523, 08136-24555 నెంబర్లకు సామాచారం అందించాలని ఆయన కోరారు.

మోదీ నేతృత్వంలో కర్ణాటకలో కాంగ్రెస్ అంతం

- నైస్ ప్రాజెక్టును ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలి
- మాజీ ప్రధాని దేవెగౌడ డిమాండ్

బెంగళూరు, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి నరేంద్రమోదీ నేతృత్వంలో కర్ణాటకలో కాంగ్రెస్ అంతం కానుందని మాజీ ప్రధాని, జేడీఎస్ జాతీయ అధ్యక్షుడు దేవెగౌడ వెల్లడించారు. బెంగళూరు జేపీ భవన్‌లో శుక్రవారం మీడి యాతో మాట్లాడుతూ గడిచిన ఆరు దశాబ్దాలుగా రాజకీయా లు చూస్తున్నానని తన అనుభవం ప్రకారం రాష్ట్రంలో కాంగ్రెస్‌కు గడ్డురోజులు వచ్చాయన్నారు. సిద్దరామయ్య, డీకే శివకుమార్‌ల నాయకత్వంలోనే పార్టీ భూస్థాపితం కానుం దన్నారు. రాష్ట్రంలో 20లోక్‌సభ స్థానాలు సాధించాలని కలలు గంటున్నారని అవి సాధ్యం కావని ఎద్దేవా చేశారు. ఉమ్మడిగా పోటీ చేస్తున్నామని, తాము ఆశిస్తున్న సీట్ల కంటే ఎక్కువ గెలుస్తామనే విశ్వాసం ఉందన్నారు. సీట్ల పంపిణీలో ఎలాంటి వివాదం లేదని కాంగ్రెస్‌ను ఓడించడమే తమ లక్ష్యమన్నారు. సెక్యులర్ భావాలకు రాజీ కాకుండా పాలన సాగించాలన్నారు. కానీ కాంగ్రెస్ (ఐఎన్‌డీఐఏ కూటమి) దేవేగౌడను అవమానించిందని మండిపడ్డారు. కర్ణాటకలో కాంగ్రెస్‌ను చిత్తుగా ఓడిస్తామని సవాల్ విసిరారు. డీకే శివకుమార్ ఎంత నగదు రవాణా చేశారు, ఎంత సీజ్ అయ్యిందనేది ఎన్నికల కమిషన్ పర్యవేక్షిస్తుందని దాటవేశారు. కాగా సీఎం సిద్దరామయ్య దేశానికే బుద్ధి చెబు తారని కానీ రాష్ట్రంలో అక్రమాలను అవినీతిని కట్టడి చేసే సత్తా ఉందా..? అని ప్రశ్నించారు. టిప్పు సుల్తాన్ అంశం మినహా మరో అంశమే లేనట్టుగా విమ ర్శలు చేస్తున్నారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం కక్షసాధింపు చర్యలకు పాల్పడుతోందని మండిపడ్డారు. 30ఏళ్లక్రితం నాటి కేసులో కర సేవకుడి అరెస్టుపై మండిపడ్డారు.

నైస్ ప్రాజెక్టును ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలి



మీడియాతో మాజీ ప్రధాని దేవెగౌడ

తన జీవితంలో ఒకే ఒక తప్పు చేశానని, అది మంచి రహదారి కావాలని బెంగళూరు నుంచి మైసూరుకు వేగవంతంగా ప్రయా ణం సాగాలని నైస్ ప్రాజెక్టుకు అంగీకరించానని దేవెగౌడ అన్నారు. అయితే మహామహులు భారీగానే దెబ్బ తీశారన్నారు. నైస్‌కు వ్యతిరేకంగా మూడు దశాబ్దాలుగా పోరాటం చేస్తున్నానని, సీఎంకు లేఖ రాశానన్నారు. వెంటనే నైస్ ప్రాజెక్టును ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలని డిమాండ్ చేశారు. 13,404 ఎకరాల భూమిని నైస్ ప్రాజెక్టుకోసం స్వాధీనం చేసుకున్నారని, ప్రస్తుతం భూముల ధర పెరగడంతో మరిన్ని కోట్లు అవుతోందన్నారు. పేదలకు అన్యాయం జరిగిందన్నారు. సామాన్య రైతులు భూములు కోల్పోయి ఉపాధికి దూరమయ్యారన్నారు. నైస్ ప్రాజెక్ట్ విషయంలో జేడీఎస్ రాజీ ప్రసక్తే లేదన్నారు.

చరిత్ర ఘట్టాలను చాటి చెప్పే స్టాంపులు

- కర్ణాపెక్స్ ప్రారంభం



యక్షగాన కళను చాటే ఫస్ట్ డే కవర్ విడుదల

బెంగళూరు, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): చరిత్ర ఘట్టాలను, ప్రముఖులకు సంబంధించిన సాధనలకు పోస్టల్ స్టాంపులు అద్దంపడతాయని బెంగళూరు సెంట్రల్ లోక్‌సభ సభ్యుడు పీసీ మోహన్ పేర్కొన్నారు. కస్తూర్బా రోడ్డులోని కంఠీరవ ఇండోర్ స్టేడియంలో ఏర్పాటైన 13వ రాష్ట్రస్థాయి పోస్టల్ స్టాంపుల ప్రదర్శనను శుక్రవారం ఆయన లాంఛనంగా ప్రారంభించారు. ప్రదర్శన విశేషాలను కర్ణాటక సర్కిల్ చీఫ్ పోస్ట్‌మాస్టర్ రాజేంద్ర కుమార్ మీడియాకు వెల్లడించారు. ఈ ప్రదర్శన ఈనెల 8వరకు కొనసాగుతుందని, ఉదయం 10 నుంచి సాయంత్రం 5వరకు తిలకించవచ్చునన్నారు. మొత్తం 600 ఫ్రేంలను ప్రదర్శనలు ఉంచామన్నారు. స్టాంపులపై ప్రత్యేక చర్చాగోష్టిలు, సాంస్కృతిక కార్యక్రమాలు, క్విజ్ పోటీలు, ట్రెజర్ హంట్, ప్రత్యేక పోస్టల్ కవర్‌ల విడుదల వంటి కార్యక్రమాలు ఉంటాయన్నారు. ఇదే సందర్భంగా శుక్రవారం మైసూరు లలిత్ మహల్ ప్యాలెస్ వందేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ప్రత్యేక పోస్టల్ కవర్ విడుదల చేశారు. కన్నడ సాహిత్య పరిషత్ అధ్యక్షుడు డాక్టర్ మహేశ్‌జోషి తదితరులు పాల్గొన్నారు. ప్రదర్శనలో భాగంగా పునీత్ రాజ్‌కుమార్, నడయాడే దేవుడిగా పేరొందిన తుమకూరు సిద్ధగంగ మఠం పీఠాధిపతి డాక్టర్ శివకుమార స్వామిజీల సంస్మరణతో ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేశారు.

మహిళలకు ఆర్థిక చేయూత

స్యాటిన్ క్రెడిట్‌కేర్‌తో కర్ణాటక బ్యాంకు ఒప్పందం

బెంగళూరు, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): సూక్ష్మ, చిన్నతరహా పరిశ్రమల ప్రోత్సాహంతో పాటు మహిళలకు రుణాలివ్వడం ద్వారా మధ్యతరగతి కుటుంబాలకు ఆర్థిక చేయూత కల్పించేందుకు కర్ణాటక బ్యాంక్ అపార అనుభవం కలిగిన స్యాటిన్ క్రెడిట్ కేర్ నెట్‌వర్క్ సంస్థతో కీలక ఒప్పందం చేసుకుంది. శుక్రవారం బెంగళూరులో కర్ణాటక బ్యాంక్ ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ శ్రీకృష్ణన్ హరిహరశర్మ స్యాటిన్ క్రెడిట్ కేర్ నెట్‌వర్క్ ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ హెచ్‌పీ సింగ్‌ల మధ్య ఒప్పందం కుదిరింది. ఇదే సందర్భంగా బ్యాంక్ సీఎండీ శ్రీకృష్ణన్ మాట్లాడుతూ సమాజంలో అన్నివర్గాలకు బ్యాంకు ద్వారా రుణసదుపాయం కల్పించాలనేది మా ఆశయమన్నారు. అర్హులైన లబ్ధిదారులను స్యాటిన్ గుర్తిస్తుందని వారికి ప్రాంతీయ శాఖల ద్వారా రుణాలు ఇస్తామన్నారు. గ్రామీణ ప్రదేశాలలో మహిళలకు రుణాలు ఇవ్వడం ద్వారా ప్రతి కుటుంబం జీవనోపాధులను పెంపొందింప చేయాలనేది మా లక్ష్యమన్నారు. దక్షిణాదినే కాకుండా ఉత్తరభారత వ్యాప్తంగా బ్యాంకు సేవల విస్తరణకు ఇదో మంచి అవకాశంగా భావిస్తున్నామన్నారు. ఆర్‌బీఐ నిబంధనలకు అనుగుణంగానే ఒప్పందంతో పాటు వ్యవహారాలు సాగుతాయన్నారు. స్యాటిన్ క్రెడిట్ కేర్ ఎండీ హెచ్‌పీ సింగ్ మాట్లాడుతూ దేశవ్యాప్తంగా 32 ఏళ్ళుగా సేవలు అందిస్తున్నామని ప్రస్తుతం 400 జిల్లాల పరిధిలో మైక్రోఫైనాన్స్ వ్యవహారాలు సాగిస్తున్నామన్నారు. దక్షిణాదిన కర్ణాటక, తెలంగాణ, తమిళనాడులలోను ఇప్పటికే సేవలు ఉన్నాయన్నారు. తొలిసారిగా కర్ణాటక బ్యాంకుతో ఒప్పందం చేసుకున్నామన్నారు. గ్రామీణ, చిన్నస్థాయి పట్టణాలకు ప్రాధాన్యత ఇస్తున్నామని తద్వారా అర్హులైన వారికి రుణాలు ఇస్తామన్నారు. యాబీ నెట్‌వర్క్ కంపెనీ సాంకేతిక సహకారం అందిస్తుందన్నారు. కర్ణాటక బ్యాంక్ జనరల్ మేనేజర్ వినయభట్, సీడీఎంఓ పంకజ్‌గుప్తా, స్యాటిన్ సంస్థ ముఖ్యులు జుగల్‌కతారియా సహా పలువురు భాగస్వామ్యులయ్యారు.



కర్ణాటక బ్యాంకు సీఎండీతో ఒప్పందం చేసుకుంటున్న స్యాటిన్ సంస్థ సీఎండీ తదితరులు

విద్యతోనే శక్తివంతమైన జాతి నిర్మాణం

- పీఈఎస్ ప్రో-చాన్స్‌లర్ ప్రొఫెసర్ జవహర్



సదస్సు వేదికపై పీఈఎస్ ప్రో-చాన్స్‌లర్ ప్రొఫెసర్ జవహర్ తదితరులు

బెంగళూరు, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): విద్యతోనే శక్తివంతమైన జాతి నిర్మాణం సాధ్యమని పీఈఎస్ యూనివర్సిటీ ప్రో-చాన్స్‌లర్ ప్రొఫెసర్ జవహర్ దొరస్వామి అభిప్రాయపడ్డారు. ఆవిష్కరణల భారత్ పేరిట పీఈఎస్ విద్యాసంస్థల స్వర్ణోత్సవాలలో భాగంగా రెండోరోజు జరిగిన సదస్సులో విద్యార్థులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ సాంకేతిక విద్య సమాజంలో అందుబాటులోకి వచ్చిందన్నారు. అందుకు యూనివర్సిటీల సంఖ్య పెరగడం ప్రభుత్వానికి అనుబంధంగా కళాశాలలు ఎక్కువ కావడం వంటివి కారణమన్నారు. గుణాత్మకమైన విద్య పొందినవారు విశ్వవ్యాప్తంగా రాణిస్తారని అభిప్రాయపడ్డారు. ఇంటిగ్రల్ కోచ్ ఫ్యాక్టరీ మాజీ జనరల్ మేనేజర్, ఇండియన్ రైల్వేసలహాదారులు సుధాన్షుమణి మాట్లాడుతూ భారత్ కలలు గన్నట్టు దేశంలోనే ఉత్తమమైన రైళ్ల నిర్మాణం సాధ్యమైందన్నారు. ఒకప్పటి రైళ్లకు ఆధునీకరణ తోడైందని ప్రస్తుతం మెట్రో రైళ్లు కొత్త ఆవిష్కరణలకు మార్గదర్శకమన్నారు. కేపీఏజే వెంచర్స్ ఫౌండర్ బీవీ జగదీశ్ మాట్లాడుతూ దేశం ఉత్తేజకమైన ప్రగతిలో ఉందని 2030 నాటికి ప్రపంచంలో మూడవ అతిపెద్ద ఆర్థికత 2047 నాటికి 10 ట్రిలియన్ డాలర్ల జీడీపీని సాధించనుందన్నారు. అందుకు భారీ పరిశ్రమలతోపాటు స్టార్టప్‌లు కీలకపాత్ర పోషిస్తాయని అభిప్రాయపడ్డారు. సిస్కోస్టార్టప్ ముఖ్యులు శృతి కన్నన్ మాట్లాడుతూ డిజిటల్ అనుభవాలు సమా జంలో ఎన్నో మార్పులకు కారణమైందన్నారు. వైద్య రంగంలో సులభతరమైన చికిత్సా విధానాలు వచ్చాయని, ఎలక్ట్రికల్ వాహనాల ద్వారా రవాణా భారం తగ్గనుందన్నారు. ఏటా ఎలక్ట్రికల్ వాహనాల వాడకం పెరగడం పర్యావరణానికి మేలన్నారు. వందలాది స్టార్టప్ కంపెనీల ద్వారా నిత్యం కొత్త ఆవిష్కరణ వెలుగులోకి వస్తోందని గుర్తు చేశారు. కృత్రిమ మేధస్సు మానవ సృజనశీలతద్వారా యువ విద్యార్థులు సాంకేతికంగా పరిణితి పొందేందుకు దోహదపడుతోందన్నారు. ప్రొక్లైమ్ చీఫ్ టెక్నికల్ ఆఫీసర్ గగన్‌రెడ్డి మాట్లాడుతూ భవిష్యత్తుకు జీవ సంరక్షణ కోసం కార్బన్ క్రెడిట్ కంపెనీలను ప్రోత్సాహించాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో కుప్పం, బెంగళూరు మెడికల్ కళాశాలల డైరెక్టర్ డాక్టర్ సురేశ్ కృష్ణమూర్తి అతిథులను సత్కరిం చారు. నూర్‌సంధ్యాబృందం సంగీత కచేరీ ఆకట్టుకుంది.

డసాల్ట్ సిస్టమ్‌తో కేఎల్‌ఈ విద్యాసంస్థల ఒప్పందం


బెంగళూరు, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): కేఎల్‌ఈ ఇంజనీరింగ్ కళాశాల ప్రపంచంలో ప్రతిష్ఠాత్మకమైన సంస్థ డసాల్ట్ సిస్టమ్‌తో కీలక ఒప్పందం చేసుకుంది. తద్వారా కేఎల్‌ఈ విద్యార్థులకు అంతర్జాతీయస్థాయిలో నైపుణ్యతతోపాటు పలు విభాగాలలో అనుకూలం కానుంది. డసాల్ట్ సిస్టమ్ సీనియర్ డైరెక్టర్ జేవియర్ ఫౌగర్, కేఎల్‌ఈ యూనివర్సిటీ వైస్‌చాన్స్‌లర్ డాక్టర్ అశోకశెట్టర్‌లు ఒప్పందపత్రాలను మార్చుకున్నారు. బెంగళూరులో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో అశోకశెట్టర్ మాట్లాడుతూ డసాల్ట్ సిస్టమ్‌లో అంతర్జాతీయస్థాయి విద్యాసంస్థలు అనుబంధంగా ఉన్నాయన్నారు. ఇక్కడి విద్యార్థులకు గ్లోబల్‌స్థాయిలో గుర్తింపుకోసమే ఒప్పందం చేసుకున్నామన్నారు. మాంటరిటెక్, యూఎస్‌సీ విటర్బీ, క్రాన్‌ఫీల్డ్ యూనివర్సిటీ, ఇలీనియస్ టెక్ వంటి ప్రతిష్ఠాత్మక సంస్థలు డసాల్ట్‌తో అనుబంధంగా ఉన్నాయన్నారు. ఎడ్యుసెంటర్ ఆఫ్ ఎక్సలెన్సీ సహభాగత్వం ద్వారా స్మార్ట్ టెక్నాలజీ, డిజిటల్ ట్విన్స్, ఆటోమేషన్, రోబోటిక్ రంగాలలో ఉన్నతమైన శిక్షణలకు అనుకూలం కానుందన్నారు. డసాల్ట్ సీనియర్ డైరెక్టర్ జేవియర్ మాట్లాడుతూ త్రీడీ ఎక్స్‌పీరియెన్స్ ఎజుసెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ అంతర్జాతీయంగా పేరొందిందన్నారు. రెండు ప్రముఖ సంస్థల అంగీకారంతో ముందుకెళ్లడం ద్వారా విద్యార్థులకు సాంకేతికత అవగాహన పెంచడంతోపాటు డసాల్ట్ సిస్టమ్ ద్వారా సర్టిఫికేషన్ ఆఫ్ ప్రోగ్రామ్ ద్వారా మరింత నైపుణ్యత సాధ్యం కానుందన్నారు.



ఒప్పందంలో ఇరు సంస్థల ప్రముఖులు

క్విజ్‌పోటీల్లో సత్తా చాటిన క్రైస్ట్ అకాడమీ

బెంగళూరు, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): మణిపాల్ హయ్యర్ అకాడమీ జాతీయ స్థాయిలో నిర్వహించిన తొలి ఎంఐక్యూ పోటీల్లో క్రైస్ట్ అకాడమీ విజేతగా నిలిచింది. ఈ కళాశాలకు చెందిన విద్యార్థులు హ్యాన్సెల్ రిజుమాథ్యూ, వరుణ్ గోయెల్‌లు తమ ఆల్‌రౌండర్ ప్రతిభతో ట్రోఫీ సహా రూ.1.5 లక్షల నగదు బహుమతిని కైవశం చేసుకున్నారు. సిలిగురి గ్రామానికి చెందిన జీడీ గోయెంకా పబ్లిక్‌స్కూల్ విద్యార్థులు రోనిత్‌బోత్రా, కుశాగ్రా ఓంలు రన్నరప్ ట్రోఫీతో రూ.1లక్ష బహుమతిని గెలుపొందారు. చెన్నైకు చెందిన ఏఎంఎం కళాశాల విద్యార్థులు ఎస్ అశ్వంత్, ఆర్యన్‌ఘోష్ తృతీయ బహుమతిగా రూ.50 వేల నగదు గెలుచుకున్నారు. జాతీయస్థాయిలో ఇంటర్‌స్కూల్ క్విజ్ పోటీలను ప్రతి ఏటా విజయవంతంగా నిర్వహించు కుంటూ వస్తున్నామని మణిపాల్ అకాడమీ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ ప్రో-వైస్‌చాన్స్‌లర్ మధు వీరరాఘవన్ తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ రిజిస్ట్రార్ రాఘవేంద్ర ప్రభుతోపాటు పలువురు ప్రముఖులు పాల్గొన్నారు. దేశవ్యాప్తంగా 820 పాఠశాలలనుంచి విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొన్నారని అంతిమంగా 24మంది ఫైనలిస్టులు గ్రాండ్ ఫినాలెలో ట్రోఫీకోసం పోటీపడ్డారన్నారు. పోటీలు ఉత్సాహంగా సాగాయన్నారు.



బహుమతి అందుకుంటున్న విద్యార్థులు

ఉత్సాహంగా సింధి కళాశాల వార్షికోత్సవం

బెంగళూరు, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): సింధి కళాశాలలో వార్షిక సాంస్కృతిక ఉత్సవం క్రెసెండో 2024 ఉత్సాహ భరితంగా జరిగింది. ఇమాజికా అనే థీమ్‌తో ఈసారి వినూత్నంగా సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. నగర వ్యాప్తంగా వందకుపైగా కళా శాలలనుంచి 1500 మందికిపైగా విద్యార్థులు రకరకాల పోటీల్లో పాల్గొని తమ ప్రతిభను చాటుకున్నారు. కళలు, సంగీతం సాహిత్యం వంటి అంశాలలో ఉదయం నుంచి సాయంత్రం వరకు పోటీలు జరిగాయి. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన శ్రేయస్ మంజు మాట్లాడుతూ విద్యార్థులకు చదువు ఎంత ముఖ్యమో, సాంస్కృతిక ఉల్లాసం, ఆటలుపాటలు కూడా అంతే ముఖ్య మన్నారు. ఇవి మానసిక వికాసానికి బాగా ఉపయోగపడతాయన్నారు. సింధి కళాశాల ఛైర్మన్ సంజీవ్ ఆత్మారాం మాట్లాడుతూ ఫ్యాషన్ షో, సోలోడ్యాన్స్, సోలో సింగింగ్, ఇన్‌స్ట్రుమెంట్స్, రంగోళి, ఫేస్ పెయింటింగ్, మ్యాడ్ యాడ్స్, బీట్‌బాక్స్, గ్రూప్‌డ్యాన్స్ వంటి పోటీలు నిర్వహించామన్నారు. సింధి ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్ ఆశాతోపాటు బోధనా సిబ్బంది పాల్గొన్నారు.



జ్యోతి ప్రజ్వలనలో ప్రముఖులు

2030 నాటికి రూ.5వేల కోట్ల టర్నోవర్ లక్ష్యం

- విదేశాల్లోనూ మార్కెటింగ్‌కు ప్రాధాన్యం
- కేఎస్‌డీఎల్ ఉత్పత్తులను పరిశీలించిన మంత్రి ఎంబీ పాటిల్



ఉత్పత్తులను పరిశీలిస్తున్న మంత్రి ఎంబీ పాటిల్

బెంగళూరు, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): కర్ణాటక సోప్స్ అండ్ డిటర్జెంట్స్ లిమిటెడ్ (కేఎస్‌డీఎల్) ద్వారా 2030 నాటికి రూ.5వేల కోట్ల టర్నోవర్ లక్ష్యంగా పెట్టుకున్నామని భారీ పరిశ్రమల శాఖ మంత్రి ఎంబీ పాటిల్ వెల్లడించారు. శుక్రవారం కేఎస్‌డీఎల్ సిబ్బందికి హెల్త్‌కార్డుల పంపిణీ, వైద్య శిబిరాన్ని మంత్రి ప్రారంభించారు. ఉత్పత్తులను మంత్రి పరిశీలించారు. అనంతరం ఆయన యశ్వంతపురలోని కేఎస్‌డీఎల్ ప్రాంగణంలో ప్రభుత్వ కార్యాలయాలకు స్థలం కేటాయించి, కాంప్లెక్స్‌లను నిర్మిస్తామని తెలిపారు. మరో వందేళ్లకు కేఎస్‌డీఎల్‌కు అవసరమైనంత భూమిని రిజర్వు చేసి మిగిలిన విస్తీర్ణంలో కాంప్లెక్స్‌లు నిర్మించే ఆలోచన ఉందన్నారు. రేస్‌కోర్సురోడ్డులో ఖనిజ భవన్ నిర్మించి వివిధ శాఖల కార్యాలయాలకు కేటాయించిన రీతిలోనే కేఎస్‌డీఎల్ ప్రాంగణంలోనూ అంచెలంచెలుగా నిర్మాణాలు చేపడతామన్నారు. మైసూరు మహారాజు, సర్ ఎం విశ్వేశ్వరయ్య ఆలోచనలతో కేఎస్‌డీఎల్ సంస్థ ఆవిష్కారమైందని వివరించారు. ఏటా రూ.1200కోట్లకుపైగా లావాదేవీలు కలిగి ఉందన్నారు. లాభాలబాటలో నడుస్తోందని, అందుకు నాణ్యమైన ఉత్పత్తుల విక్రయమే కారణమని పేర్కొన్నారు. 2025 నాటికి రూ. 2,500 కోట్లు, 2030 నాటికి రూ.5వేల కోట్ల టర్నోవర్ సాధించడమే లక్ష్యమన్నారు. విదేశాల్లోనూ మార్కెటింగ్‌కు ప్రాధాన్యత ఇస్తామన్నారు. యూరప్, అరబ్ దేశాల్లోనూ కేఎస్‌డీఎల్ ఉత్పత్తులను ఎగుమతి చేయనున్నామని ప్రకటించారు. కేఎస్‌డీఎల్ ప్రాంగణంలో ప్రత్యేక కౌంటర్ ద్వారా నిత్యావసరాలు, డెట్టాల్, హ్యాండ్‌సోప్ వంటివి అందుబాటులో ఉంచాలని సూచించారు. సంస్థ కార్మికుల సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తోందని కొనియాడారు. ప్రభుత్వ అనుబంధమైన సంస్థ ప్రగతికోసం అందరూ సహకరించాలన్నారు. కేఎస్‌డీఎల్ మేనేజింగ్ డైరెక్టర్ ప్రశాంత్, అడ్మిన్ గంగప్ప, మల్లిగె ఆసుపత్రి సీఈఓ డాక్టర్ శ్రీనివాస్, పరిశ్రమలశాఖ ముఖ్యఅధికారి మహంతేశ్ బిరాదార్ పాల్గొన్నారు.

పర్యావరణకు ప్రాధాన్యమివ్వాలి : గవర్నర్



గవర్నర్‌కు టేబుల్ క్యాలెండర్ అందజేత

బెంగళూరు, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): పర్యావరణకు ప్రాధాన్యత ఇవ్వాలని తద్వారా భావితరాల మనుగడ సాధ్యమని గవర్నర్ థావర్‌చంద్ గెహ్లాట్ అభిప్రాయపడ్డారు. పర్యావరణ పరిరక్షణకు దోహదపడేలాంటి టేబుల్ క్యాలెండర్‌ను గవర్నర్ రాజ్‌భవన్‌లో శుక్రవారం ఆవిష్కరించారు. నగరవాసి దిజీష్ రూపొందించిన టేబుల్ క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. సమాజానికి ఒక ప్రత్యేక సందేశాన్ని ఇచ్చినట్టుగా ఉందని గవర్నర్ ప్రశంసించారు.

అంతర్జాతీయ మహిళా వీల్‌చైర్ బాస్కెట్‌బాల్ టోర్నీకి

భారత్ జట్టుకు నలుగురు బెళగావి యువతులు



ఎంపికయిన యువతులు

బెంగళూరు, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): థాయ్‌ల్యాండ్‌లో జరిగే అంతర్జాతీయ మహిళా వీల్‌చైర్ బాస్కెట్‌బాల్ పోటీలకు భారత్ తరపున ఆడేందుకు బెళగావికి చెందిన నలుగురు యువతులు ఎంపికయ్యారు. ఎరగట్టి తాలూకా తావళగేరే గ్రామానికి చెందిన మాయవ్వ మహదేవప్ప, ఎరగట్టి తాలూకా ఆలదకట్టి గ్రామానికి చెందిన లక్ష్మీరాయప్ప, ఆనగోళ గ్రామానికి చెందిన ఆరతి సురేశ్ పవార, ఖానాపుర తాలూకా బైలూరుకు చెందిన లలితా శంకర గవాసలు ఎంపికయ్యారు. ఈనెల 9నుంచి 21వరకు బ్యాంకాక్‌లో ఏషియా ఓషియానియా జోన్ అంతర్జాతీయ మహిళా వీల్‌చైర్ బాస్కెట్‌బాల్ పోటీలు జరగనున్నాయి. బెళగావి నుంచి ఎంపికైన నలుగురు క్రీడాకారిణులను విశ్వాస ఫౌండేషన్‌లో శిక్షణ పొందారు. కోచ్ బసవరాజ సునదోలి ద్వారా మూడేళ్లుగా టేబుల్ టెన్నిస్, బాస్కెట్‌బాల్ పోటీల్లో శిక్షణ పొందుతున్నారు. ఇటీవల నవంబరులో చత్తీస్‌ఘడ్‌లో రాజనందగావ్‌లో జరిగిన జాతీయ స్థాయి పోటీల్లో నలుగురు క్రీడాకారులు బంగారుపతకాలు సాధించారు.

ప్రజలకు చేరువగా కేంద్ర పథకాలు


- వికసిత భారత సంకల్ప యాత్రలో ఎంపీ మునిస్వామి

శిడ్లఘట్ట, జనవరి 5: ప్రధానమంత్రి నరేంద్రమోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు గ్రామీణ ప్రాంత ప్రజలకుసైతం అందేలా వికసిత భారత సంకల్ప యాత్ర అభియాన చేపట్టినట్టు ఎంపీ ఎస్ మునిస్వామి అభిప్రాయపడ్డారు. జంగమకోటె, జే వెంకటపుర గ్రామంలో వికసిత సంకల్పయాత్ర కార్యక్రమానికి జ్యోతిప్రజ్వలన చేసి మాట్లాడారు. కేంద్రప్రభుత్వం ప్రజల అభివృద్ధికి ఎన్నో పథకాలు రూపొందించిందన్నారు. వీటి ద్వారా ప్రతి ఒక్కరూ ప్రయోజనం పొందడమే లక్ష్యమన్నారు. నరేగా పథకం ద్వారా గ్రామ పంచాయతీ అభివృద్ధి పనులు సాగుతున్నాయంటే అది కేంద్రప్రభుత్వ నిధులతోనే అన్నారు. గ్రామీణ ప్రాంత లింక్ రోడ్లను సైతం బాగు చేయాలన్నది ప్రధాని మోదీ ఉద్దేశ్యమన్నారు. ఈ సందర్భంగా పీఎం కిసాన్ డ్రోన్ పథకం గురించి వివరించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే రాజణ్ణ, బీజేపీ నాయకుడు సీకల్ ఆనంద్‌గౌడ, బీజేపీ తాలూకా అధ్యక్షుడు కమ్మదహళ్ళి సురేంద్రగౌడ, బీజీ రాజు, ఆంజనేయగౌడ తాలూకా ఆరోగ్యాధికారి వెంకటేశ్‌మూర్తి, దేవరాజ్, పీడీఓ, అధ్యక్ష, ఉపాధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

ఎన్ఎస్ఎస్ శిబిరాలతో సేవాభావం

బాగేపల్లి, జనవరి 5: ఎన్ఎస్ఎస్ శిబిరాల్లో పాల్గొనడం ద్వారా జాతీయత, భావైక్యత, నాయకత్వ గుణాలతోపాటు సేవా మనోభావం పెంపొందుతుందని నేషనల్ పీయూ కళాశాల అధ్యక్షుడు కే నరసింహప్ప అభిప్రాయపడ్డారు. తాలూకాలోని దేవర గుడిపల్లిలో వారం రోజుల ఎన్ఎస్ఎస్ శిబిరాన్ని ఉద్దేశించి మాట్లాడారు. జాతీయ సేవా పథకం అనేది మహాత్మాగాంధీ పరికల్పన అన్నారు. గ్రామాల స్వరాజ్యం కోసం, అభివృద్ధి కోసం యువత ఎన్ఎస్ఎస్ సేవకులుగా గ్రామాలలో తమను తాము సమర్పించుకునేలా ప్రేరేపిస్తుందన్నారు. ఈ శిబిరాలు విద్యార్థులు, సముదాయాల మధ్య చక్కటి సంబంధాలు నెలకొంటాయన్నారు. ఈ సందర్భంగా రిటైర్డు ప్రిన్సిపాల్ డీ శివణ్ణ, పీ వెంకటరామ్, ఏకే నింగప్ప, జయరాంరెడ్డి, ప్రిన్సిపాల్ వెంకటరెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ ఆర్ఎన్ వెంకటేశ్‌బాబు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ నరసింహ తదితరులు పాల్గొన్నారు.

గస్తీ కోసం వాహనం బహూకరణ



జిల్లా ఎస్పీకి వాహనాన్ని అప్పగిస్తున్న వెల్ఫేర్ సభ్యులు

హొస్కోటె, జనవరి 5: తాలూకా లోని పిల్లగుంపె పారిశ్రామికవాడలో నేరాల నియంత్రణకోసం హొస్కోటె ఇండస్ట్రీస్ వెల్ఫేర్ ఫోరం ఆధ్వర్యంలో గస్తీ వాహనాన్ని బహూకరించారు. శుక్రవారం ఏర్పాటైన కార్యక్రమంలో సుమారు రూ.10లక్షల విలువైన వాహనాన్ని బెంగళూరు గ్రామీణ జిల్లా ఎస్పీ మల్లికార్జున బాలదండికి అందచేశారు. ప్రత్యేకించి మొబైల్ చోరీలు, ఇతర దొంగతనాలు, ట్రాఫిక్ సమస్యపై ఇప్పటికే చర్చించడంతో వాహనాల కొరతకు సంబంధించి వెల్ఫేర్ ఫోరం స్పందించిందన్నారు. వెల్ఫేర్ ఫోరం అధ్యక్షుడు కృష్ణప్ప, డీఎస్పీ శంకరేగౌడ పాటిల్, సీఐ అశోక్, ట్రాఫిక్ సీఐ రఘు, వివిధ ఫ్యాక్టరీల పదాధికారులు పాల్గొన్నారు.

తనిఖీల్లో రూ.17.95 లక్షలు స్వాధీనం

డీ.హీరేహాళ్, జనవరి 5: జిల్లా ఎస్పీ ఆదేశాలతో కర్ణాటక సరిహద్దు చెక్ పోస్టుల వద్ద సెబ్, పోలీసుల తనిఖీలు నిర్వహిస్తుండగా బళ్లారి నుండి బెంగుళూరుకు ఆధారాలు లేకుండా తరలిస్తున్న రూ. 17.95 లక్షల నగదును సీజ్ చేసినట్లు సెబ్ అదనపు ఎస్పీ జీ రామకృష్ణ తెలియజేశారు. జిల్లా ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ ఆదేశాలతో కర్ణాటక సరిహద్దు చెక్‌పోస్టుల వద్ద సెబ్ విభాగం, పోలీసులు ఓబుళాపురం చెక్‌పోస్ట్ వద్ద తనిఖీలు చేపట్టారు. బళ్లారి నుండి బెంగుళూరు వైపు వెళుతున్న ఒక కారుని ఆపి తనిఖీ చేశారు. తమిళనాడు రాష్ట్ర హోసూరు జిల్లా శూలగిరిలో ఉన్న సోనాజి ఇండస్ట్రీస్, మహావీర్ ఎక్స్‌పోర్ట్ కంపెనీ యజ మాని హరిరామ్, ఇతని మిత్రుడు బెంగుళూరు రవి అరోరాలు ఉన్నారు. రూ. 17,95,000 నగదు తీసుకెళుతున్నట్లు గుర్తించారు. సదరు నగదుకు ఎలాంటి బిల్లులు లేకపోవడంతో సీజ్ చేశారు. అనంతరం ఐటీ శాఖకు పంపుతున్నామని వివరించారు.